

# హిప్నాటిజం

క్యాలెండర్ తప్ప మరోటి కదలని ఆ ఆఫీసులో పది రోజులుగా ఫైళ్ళు కూడా చకచకా కదిలిపోతున్నాయి.

ఆఫీసర్ అనంతశయనం గారి నుంచి మెసెంజర్ మొలాంఖలీ దాకా ప్రతి ఒక్కరూ "టిప్" నుంచి 'టో' వరకు "టిప్‌టాప్"గా తయారై, ఠంచన్‌గా పది గంటలకల్లా ఆఫీసుకి చేరిపోతున్నారు.

సాయంత్రం ఐదుగంటలయినా టీకి, టిఫిన్‌కి, టాయ్‌లెట్‌కి కూడా సీట్లోంచి లేవడం లేదు స్టాఫ్ ఎవరూ. అంతా చమత్కారంగా జరిగిపోతుంది.

ఆ చమత్కారణం లేడీ స్టెనోగ్రాఫర్ డైరా

డైరా అంటే డైరాయే!

మిస్సిండియా పోటీల్లో మిస్ కాకూడని మినీ మిసైల్!!

దేవిక ముక్కు, సావిత్రి పెదవులు, విజయలలిత కళ్ళు, కె.ఆర్.విజయ పళ్ళు, జయమాలిని ...అబ్బో ఎందుకులెండి? కళ్ళుంటే చాలు. కాళ్ళు లేనివాడు కూడా కాల్జారడమే.

నిజానికి డైరా అసలు పేరు సైరా. కాని ఆమె నుంచి "నే సైరా" అనే డైలాగ్ ఆశించిన ప్రతివాడికి "యూ డైరా" అనే సమాధానం రావడంతో అదే ఆమె ముద్దుపేరై కూర్చుంది. అదీకాక ప్రేమ్‌కుమార్ తాలూకు డైమన్ రాణి కూడా ఆమె.

జాయినప్పటినుంచి, జాయినయిన చోటు నుంచి కదలని డైరా, తప్పనిసరై, కొంతకాలంగా అనంతశయనం గారి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చింది.

అనంతశయనం గారు అనుభవజ్ఞుడైన ఆఫీసరు. పెద్ద 'లైన్‌మన్' ప్రేమ్‌కుమార్‌కి అన్ని రంగాలలోనూ గురువు.

అసలు ఆయనగారి జాతకరీత్యా రవి రాహువులు పరివర్తనలో వుండి, రాహువులో రవి వచ్చి, చంద్ర విదశలో అదృష్టం కలిసొచ్చి ఆ ఇరవై ఏడు రోజుల్లోనే మంత్రిమండలి తారుమారయి ఇంకా కుర్చీలో వున్నాడు కాని, లేకపోతే రెండేళ్ళ క్రిందే రిటైరయ్యేవాడు గురువుగారు...

మొదటి రోజునే డైరాతో "ఏఫ్టరాల్! ప్రేమ్‌కుమార్ ఈజ్ కిడ్! వాడికి ప్రేమలో ఏబీసిడీలు నేర్పింది నేను"అన్నాడు.

"ఔను సార్! ఆయనా ఈమాటే అంటుంటారెప్పుడూ" అంది డైరా

"ఏ మాట! అనంతశయనం ఈజ్ కిడ్ అనా!" సీరియస్‌గా చూస్తూ చిద్విలాసంగా నవ్వాడు.

"నో నో సర్! తన ప్రేమ పాఠాల గురువు మీరేనని"! సిన్సియర్‌గా చూస్తూ సిల్లీగా నవ్వింది.

"వెరీగుడ్! ఇంకేమంటాడు" ఎమోషనల్‌గా ఎంక్వైరించాడు.



"మీ కళ్ళల్లో కారం వుందని, దాని జోలికి మాత్రం వెళ్ళద్దనీ.." అంది కళ్ళు తిప్పుతూ...

"వెరీగుడ్" కళ్ళు మూసుకుని కాలింగ్‌బెల్ నొక్కాడు అనంత శయనం. కళ్ళు త్రిప్పుకుంటూ, షార్టుహేండ్ నోట్‌బుక్, పెన్సిల్‌తో లోపలికి వచ్చింది డైరా.

నాలుగు రోజులుగా డైరా ఘుమఘుమలూ, అనంతశయనం ఘుమఘుమలూ గమనిస్తున్న స్టాఫ్ కందరికీ ఛిమఛిమలుగా ఉంది.

మెల్లిగా మూసుకుంటున్న తలుపుకేసి నిశితంగా చూస్తూ, తన సహజమైన హిప్నోటిక్ వాయిస్‌తో "డైరా తలుపు బోల్ట్ వేసి రా!" అన్నాడు అనంతశయనం.

డైరా చూసింది రిటైరవబోతున్న ఆయన కళ్ళు రేస్‌కార్ టైర్లల్లే వున్నాయి. దగ్గరగా వచ్చి "ఏమిటి సార్?" అంది వణుకుతున్న కంఠంతో.

"తలుపు... బోల్ట్ వేసి..రా" అన్నాడు బాస్ "బేస్" వాయిస్‌లో

"ఏం సార్! నేనేమన్నా మీ భార్యననుకుంటున్నారా, తలుపెయ్యమంటున్నారు?" అంది డైరా హఠాత్తుగా "స్లర్" వాయిస్‌తో

డైరా డైరక్ట్ డైలక్టకి డైలమాలో పడ్డ అనుభవం "నో, నో" అంటూ "షార్ప్" వాయిస్‌లో ఏదో చెప్పబోయింది.

"పోన్లెండి సర్! మీరెలా అనుకున్నా ఫరవాలేదు. నేను మాత్రం ఒక్కసారి మీ భార్యననుకుని ఓ మాటంటాను. మీకేమైనా అబ్జెక్షనా?" అంది గోముగా "టై" వాయిస్‌లో.

'నాటెటాల్! నాటెటాల్! కమాన్! కమాన్! ఉక్కిరిబిక్కిరైన బాస్ వాయిస్ "హైపిచ్" చేరుకుంది.

"అయితే ఆ తలుపేదో నువ్వే వేసుకుని చావు నీమొహానికో అసిస్టెంటు కూడాను" అంది డైరా "ట్రెబుల్" పిచ్‌లో.

అర్ధాంగి ఆండాళమ్మగారి అరటన్ను విగ్రహం "హిప్నోటిక్ ఐస్" ముందర హిప్పో పోటోమస్ లాగా కదిలి, కుర్చీతో పాటు కుప్పకూలిపోయి గిలాగిలా తన్నుకోసాగాడు ఆనన్‌శైవం అయంగార్.

లారీడు "వుడ్‌రోజ్" పువ్వులు నెత్తిన దిమ్మరించినట్లు కిలకిలా నవ్వుతూ బయటకెళ్లింది డైరా.